RNI NO.TELTEL/2023/90455

# మన ప్రజాప్రతినిధి దినపత్రిక

ఎడిటర్ : జి.శ్రీనివాస్ సంపుటి : 2 సంచిక : 182 శనివారం, మే 03 2025, పేజీలు - 4 వెల : 2/-

https://epaper.manaprajaprathinidhi.com

PUBLISHED FROM : TELANGANA / ANDHRAPRADESH

ప్రజా ప్రతినిధి NEWS టీ.వి

తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో మన ప్రజా ప్రతినిధి దినపత్రికకు, టీ.వి ఛానల్ కు జిల్లాల వారీగా, స్టాఫ్ రిపోర్టర్ మరియు మండలాలకు రిపోర్టర్స్, యాడ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను అనుభవం ఆసక్తి ఉన్నవారు

సంప్రదించండి

7382966665
7382566600

# అమరావతి పనుల్ని పునఃప్రారంభించారు

## మోడీ రాజధాని పోలవరానికి సహకరిస్తామని హామీ

**అమరావతి :**అమరావతి రాజధాని పనుల్ని ప్రధాని నరేంద్ర మోడీ పునఃప్రారంభించారు. అమరావతిలో ఏర్పాటు చేసిన భారీ సభలో ఆయన వర్చువల్ గా 18 ప్రాజెక్టులకు శంఖుస్థాపన చేశారు. ఇందులో పలు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు ఉన్నాయి. ఈ సందర్భంగా అమరావతితో పాటు ఆంధ్రప్రదేశ్ కు అవసరమైన సాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. అమరావతి రాజధాని పనులు సహా మొత్తం 58 వేల కోట్ల ప్రాజెక్టులకు ప్రధాని మోడీ ఇవాళ శంఖుస్థాపన చేశారు. ఇందులో 49 వేల కోట్లు రాజధాని అమరావతి పనులకే కేటాయించారు. మరో 8 వేల కోట్ల విలువైన కేంద్ర ప్రాజెక్టులూ ఉన్నాయి.తల్లి దుర్గాభవానీ కొలువైన పుణ్యభూమిపై మిమల్ని కలవడం ఆనందంగా ఉందని ప్రధాని మోడీ తన ప్రసంగం ప్రారంభించారు. అమరావతి పుణ్యభూమిపై నిలబడిన తనకు కేవలం ఒక నగరం కనిపించడం లేదని, ఓ స్వప్నం సాకారమవుతున్నట్లు కనిపిస్తుందన్నారు. ఓ కొత్త అమరావతి, ఓ కొత్త ఏపీ తనకు కనిపిస్తోందన్నారు. అమరావతి కేవలం కాంక్రీట్ నిర్మాణం కాదని, భారత ఆశల సౌధం కూడా అని మోడీ తెలిపారు. సీఎం చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కు మోడీ ఈ




సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.ఇంద్రలోకపు రాజధాని పేరు అమరావతి అని, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజధాని కూడా అమరావతేనన్నారు. ఇది కాకతాళీయం మాత్రమే కాదు స్వర్ణాంధ్ర నిర్మాణానికి ఆరంభం అన్నారు. అమరావతి కేవలం ఒక నగరం కాదు, ఒక శక్తి అని, ఆంధ్రప్రదేశ్ ను అధునాతన ప్రదేశ్ గా మార్చే శక్తి అన్నారు. అమరావతి ఆంధ్రప్రదేశ్ లో ప్రతీ యువకుడి కలల సాకారం చేసే నగరం అవుతుందన్నారు. ఏఐ, గ్రీన్ ఎనర్జీ, క్లీన్ ఇండస్ట్రీ వంటివి ఇందులో ఉన్నాయన్నారు. ఈ రంగాల్లో అమరావతి నాయకత్వం వహిస్తుందన్నారు.

వీటిని పూర్తి చేయడంలో కేంద్రం రాష్ట్రానికి పూర్తి సహకారం అందిస్తుందన్నారు.తాను గుజరాత్ కు తొలిసారి ముఖ్యమంత్రి అయినప్పుడు చంద్రబాబు హైదరాబాద్ లో ఐటీ రంగం కోసం తీసుకున్న చర్యల్ని అధ్యయనం చేసే వాడినని మోడీ తెలిపారు. వాటిని తాను ఇప్పుడు ఇక్కడ అమల్లో పెడుతున్నట్లు తెలిపారు. నా అనుభవంతో చెబుతున్నా.. భవిష్యత్ సాంకేతిక పరిజ్ఞానం అయినా, పెద్ద ప్రాజెక్టుల్ని నాణ్యంగా చేయాలంటే చంద్రబాబుతోనే అవుతుందని మోడీ ప్రశంసించారు.
2015లో ప్రజా రాజధానిగా అమరావతికి తాను శంఖుస్థాపన చేశానని, గత పదేళ్లుగా అన్ని విధాలా సహకారం అందించామని, ఇప్పుడు చంద్రబాబు నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పడ్డాక అసెంబ్లీ, హైకోర్టు వంటి నిర్మాణాలకు కూడా కేంద్రం సహకారం అందిస్తుందన్నారు. ఎన్టీఆర్ వికసిత ఆంధ్రప్రదేశ్ కల కన్నారని, తాము ఇప్పుడు దాన్ని సాకారం చేయాల్సి ఉందన్నారు. ఇది మనం చేయాలి, మనమే చేయాలి బ్రదర్ పవన్ కళ్యాణ్ అన్నారు.గత పదేళ్లుగా సోషల్, డిజిటల్ మౌలిక సౌకర్యాలపై దేశం దృష్టిసారించిందని, ఇప్పుడు రోడ్డు, రైలు ప్రాజెక్టులకు కేంద్రం పూర్తి సహకారం అందిస్తోందన్నారు.

# పాక్ ప్రధాని యూట్యూబ్‌పైనా వేటు

## ప్రసారాలు నిలిపివేసిన భారత ప్రభుత్వం



**న్యూఢిల్లీ,మే2:** పహల్గాం ఉగ్రదాడితో భారత్–పాక్ సంబంధాల్లో తీవ్ర ఉద్రిక్తత నెలకొన్న వేళ అనేక చర్యలు తీసుకుంటున్న భారత్ పలు పాక్ యూట్యూబ్ ఛానళ్లను నిషేదించింది.. ఆ ఘటన తర్వాత భారత ప్రభుత్వం అనేక కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. తాజాగా పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ యూట్యూబ్ ఛానల్ స్ట్రీమింగ్‌ను మనదేశంలో నిలిపివేసింది. జాతీయ భద్రతకు సంబంధించి భారత ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ కంటెంట్ ప్రస్తుతం ఈ దేశంలో అందుబాటులో లేదని ఆ ఛానల్ క్లిక్ చేసిన వారికి ఒక సందేశం దర్శనమిస్తోంది. ఉద్రిక్తతలు భగ్గుమంటోన్న వేళ.. పాకిస్థాన్ కేంద్రంగా నిర్వహిస్తున్న పలు యూట్యూబ్ ఛానళ్ల ప్రసారాలు, సామాజిక మాధ్యమ ఖాతాలను భారత్‌లో నిలిపివేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. పాక్ న్యూస్, ఎంటర్టైన్‌మెంట్ మీడియాకు చెందిన పలు ఛానళ్లపై వేటు పడింది. పాక్ మాజీ ఆటగాళ్లు షోయబ్ అక్తర్, బాసిత్ అలీ, షాహిద్ అఫ్రిది ఛానళ్లు కూడా అందులో ఉన్నాయి. ఆ దేశ రక్షణ మంత్రి ఎక్స్ ఖాతాను బ్లాక్ చేసింది. పాకిస్థాన్ క్రికెటర్స్ బాబర్ అజామ్, మహ్మద్ రిజ్వాన్, షహీన్ అఫ్రిదీ ఇన్‌స్టా ఖాతాలను తాజాగా సస్పెండ్ అయ్యాయి. పాకిస్థాన్ జావెలియన్ త్రోయర్, ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత అర్షద్ నదీమ్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను ఇప్పటికే బ్లాక్ చేసిన సంగతి తెలిసిందే. పహల్గాం ఉగ్రవాద దాడి తర్వాత చట్టపరమైన చర్యల్లో భాగంగా భారత్‌లో అతని ఖాతాను నిలిపివేశారు.

# ఇటు బిజెపి, అటు కాంగ్రెస్

## అన్యాయమే చేస్తున్నాయి హరీశ్ రావు



**సంగారెడ్డి:** తెలంగాణను బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. తెలంగాణకు అన్యాయం తప్ప ఏం చేయలేదని మండి పడ్డారు. మరోవైపు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని చెప్పారు. బీఆర్ఎస్ ప్రారంభించిన బసవేశ్వర సంగమేశ్వర ప్రాజెక్టును రేవంత్ సర్కార్ పూర్తిగా పక్కన పెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జహీరాబాద్ నియోజకవర్గంలోని న్యాల్‌కల్ మండలం రత్నాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హరీశ్‌రావు సమక్షంలో నేడు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జహీరాబాద్ నియోజకవర్గానికి కాంగ్రెస్ పార్టీ అన్యాయం చేసిందన్నారు. సంగారెడ్డి జిల్లా అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తున్నదని విమర్శించారు. సంగమేశ్వర ప్రాజెక్టు పూర్తయితే జిల్లా మొత్తం సాగు నీటితో సస్యశ్యామలం అవుతుందని చెప్పారు. బసవేశ్వర ప్రాజెక్టు పూర్తి చేయడానికి బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని వెల్లడించారు. తాగు, సాగు నీరు కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, బీఆర్ఎస్ ఉన్నపుడు వచ్చిన నీళ్ళు ఇప్పుడు ఎందుకు రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# తెలంగాణ ప్రభుత్వాన్ని కేంద్రం ఫాలో అవ్వాలి

**ఢిల్లీ:**ఢిల్లీలో అత్యవసరంగా సమావేశమైన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తెలంగాణ ప్రభుత్వం చేసిన కులగణనను అభినందించింది. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తన ప్రభుత్వం చేసిన కులగణన గురించి సమావేశంలో ప్రజెంటేషన్ ఇవ్వగా సీడబ్ల్యూసీ హర్షం వ్యక్తం చేసింది . తెలంగాణ ప్రభుత్వం అత్యంత సమర్థవంతంగా పూర్తి వివరాలతో కులగణనను నిర్వహించిందని, కేంద్ర ప్రభుత్వం కూడా తెలంగాణ మోడల్‌ని ఫాలో కావాలని సూచించింది. పౌర సమాజం సామాజిక కార్యకర్తలు వివిధ సామాజిక వర్గాల లీడర్లను ప్రక్రియలో భాగస్వాములు చేశారని, అధికారులతో అంతర్గత కసరత్తు కాకుండా బహిరంగంగా ప్రజల నుంచి వివరాలు సేకరించారని సీడబ్ల్యూసీ వివరించింది. తెలంగాణ ప్రభుత్వం అనుసరించిన పద్ధతిని కేంద్రం ఫాలో అవ్వాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ గట్టిగా కోరుతోంది.ఈ నేపథ్యంలోనే పెహల్గాం ఉగ్రదాడి మృతులకు సీడబ్ల్యూసీ సంతాపం తెలిపింది. బాధిత కుటుంబాల బాధ.. మొత్తం దేశం బాధ అని పేర్కొంది. ఉగ్రదాడికి దేశం



మొత్తం జవాబుదారీతనం అని, న్యాయం కోసం ఎదురు చూస్తోందని తెలిపింది. ఇది రాజకీయాలకు సమయం కాదని,

పాకిస్తాన్‌కు గుణపాఠం నేర్పడానికి ఉగ్రవాదాన్ని నిర్ణయాత్మకంగా అరికట్టడానికి ఒక దేశంగా మన సమిష్టి సంకల్పాన్ని ప్రదర్శించాల్సిన సమయం అని వ్యాఖ్యానించింది.ఉగ్ర దాడికి సూత్రధారులు, నేరస్థులు పూర్తి పరిణామాలను ఎదుర్కోవాలని, ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్తాన్‌ను ఒంటరిగా చేసి శిక్షించడానికి భారత ప్రభుత్వం దృఢంగా, వ్యూహాత్మక స్పష్టతతో అంతర్జాతీయ సమన్వయంతో వ్యవహరించాలని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని కోరుతోంది. బాధితుల కుటుంబాలకు నిరంతర నైతిక, సంస్థాగత మద్దతు ఇవ్వాలని కూడా కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. బాధిత కుటుంబాలకు పరిహారం మాత్రమే కాకుండా..దీర్ఘకాలిక పునరావాసం, మానసిక మద్దతు కల్పించాలని డిమాండ్ చేసింది. భద్రత నిఘాలో తీవ్రమైన లోపాలకు కాలపరిమితితో కూడిన జవాబుదారీతనం ఉండాలని కూడా సీడబ్ల్యూసీ సూచించింది.



### తెలంగాణలో భగ్గుమంటున్న ఎండలు..

## ఆ జిల్లాకు రెడ్ అలర్ట్ జారీ

**హైదరాబాద్:**తెలంగాణవ్యాప్తంగా ఎండలు మండి పోతు న్నాయి. రాష్ట్రంలో రోజురోజుకు పెరుగుతున్న భానుడి భగభగలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంట్లో నుంచి భయటకి రావాలంటేనే భయపడుతున్నారు. ఈ క్రమంలో వాతావరణ శాఖ ప్రజలను అప్రమత్తం చేస్తోంది. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న జిల్లాకు అలర్ట్ జారీ చేస్తోంది. ఇక గురువారం రాష్ట్ర ంలో రికార్డ్ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోద య్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని జిల్లాలతో పోలీస్తే ఆదిలాబాద్ జిల్లాలో అత్యధికంగా 45.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయినట్టు తెలుస్తోంది.

# చంద్రబాబు సమక్షంలో పవన్ కు ప్రధాని మోదీ సర్‌ప్రైజ్ గిఫ్ట్

**అమరావతి :**అమరావతి రీ లాంఛ్ సభలో ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకున్నాయి. ప్రధాని వేదిక మీదకు వచ్చిన సమయంలో రైతుల నుంచి అనూహ్య రీతిలో స్వాగతం లభించింది. ప్రధాని సమక్షం లో డిప్యూటీ సీఎం పవన్ కీలక ప్రసంగం చేసారు. గత అయిదేళ్లు కాలంలో వైసీపీ హయాంలో రైతుల కష్టాలను ప్రస్తావించారు. పహల్గాం లో ఉగ్రదాడి పైన ఆవేదన వ్యక్తం చేసారు. ఇలాంటి సున్నిత సమ యంలో ప్రధాని అమరావతి రావటం పైన ధన్యవాదాలు చెప్పారు. పవన్ ప్రసంగం పూర్తయిన తరువాత పవన్ కు ప్రధాని మోదీ సర్ప్రైజ్ గిఫ్ట్ ఇచ్చారు.పవన్ కు గిఫ్ట్‌డిప్యూటీ సీఎం పవన్ ప్రసంగానికి ప్రధాని మోదీ స్పెషల్ గిఫ్ట్ ఇచ్చారు. ప్రధాని మోదీ సమక్షంలో పవన్ ఆసక్తి కర వ్యాఖ్యలు చేసారు. కాశ్మీర్ లో ఉగ్రదాడుల అంశాన్ని ప్రస్తావించారు. గత అయిదేళ్ల కాలంలో అమరావతి రైతుల కష్టాలను గుర్తు చేసారు. కూటమి నేతలు హామీ ఇచ్చిన విధంగా అమరావతి తిరిగి నిలబడుతుందని చెప్పుకొచ్చారు. దేశానికే తల మానికంగా అమరావతి నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేసారు. కాశ్మీర్ లో ఉగ్రదాడుల అంశం ప్రస్తావన సమయంలో పవన్ ఎమోషనల్ అయ్యారు. ఇలాంటి సమయంలో



ప్రధాని అమరావతి కోసం రావటాన్ని అభినందించారు.

ప్రసంగం పూర్తయిన పవన్ కు ప్రధాని ప్రత్యేకంగా తన వద్దకు పిలిచారు. పవన్ ను అభినందిస్తూ తన వద్ద ఉన్న చాక్లెట్ ను గిఫ్ట్ గా అందించారు.గత ప్రభుత్వంలో వేధింపులకు గురయ్యారని చెప్పుకొచ్చారు. రాజధాని కోసం అమరావతి మహిళల పాత్ర అద్భుతమని. ఆంధ్ర పౌరుషం చూపించారని ప్రశంసించారు. గత అయిదేళ్ల కాలంలో రైతులను గత ప్రభుత్వం అవమాన పరిచిందన్నారు. అమరావతి మళ్లీ ఒక ప్రపంచ స్థాయి సర్వ శ్రేష్ఠ రాజధానిగా నిలుస్తుందని పవన్ పేర్కొన్నారు. జవాబుదారీ, సామాజిక న్యాయానికి ప్రతీకగా నిలుస్తుందని చెప్పారు.

### పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

# పరీక్షల షెడ్యూల్ వచ్చేసింది..




**హైదరాబాద్, మే 2:** తెలంగాణ రాష్ట్ర పదో తరగతి ఫలితాలు ఏప్రిల్ 30వ తేదీన విడుదలైన సంగతి తెలిసిందే. ఇందులో ఫెయిలైన విద్యార్థులతోపాటు మార్కులు తక్కువ వచ్చిన వారికి అడ్వాన్స్‌డ్ సప్లిమె ంటరీ పరీక్షలు నిర్వహించేందుకు షెడ్యూ ల్‌ను ప్రభుత్వ పరీక్షల విభాగం తాజాగా విడుదల చేసింది. తాజా షెడ్యూల్ ప్రకారం జూన్ 3వ తేదీ నుంచి సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమవుతాయి. ఈ పరీక్షలు జూన్ 3వ తేదీ నుంచి జూన్ 13వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఆయా తేదీల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు.ఇక సప్లిమెంటరీ పరీక్షలు రాసే విద్యార్థులకు దరఖాస్తు ప్రక్రియ కూడా ఇప్పటికే ప్రారంభమైంది. విద్యార్థులు ఎలాంటి ఆలస్య రుసుము లేకుండా మే 16వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చు. పదో తరగతి పరీక్షలు ఫెయిలైన విద్యార్థులంతా ఈ పరీక్షలు రాయవచ్చు. అలాగే ఒక్కో సబ్జెక్టుకు రీకౌంటింగ్‌కు రూ.500, రీ వెరిఫికేషన్‌కు రూ.1000 చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందుకు మే 15వ వరకు అవకాశం ఉంటుంది.

# హరిరామ్‌ను కస్టడీకి తీసుకున్న ఏసీబీ

**హైదరాబాద్:** కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు అవకతవకల కేసుచంచల్ గూడ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న ఈఎన్‌సిభూక్య హరిరామ్ ఏసీబీ అధికారులు ఐదు రోజుల కస్టడీ తీసుకున్నారు. ఈ నెల 6వ తేదీ వరకు హరి రామ్‌ను ఏసీబీ అధికారులు విచారించనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో హరి రామ్ కీలకంగా వ్యవహరించారు. ఆయనను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే విధుల నుంచి సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజినీరింగ్ చీఫ్ ఈఎన్‌సీ హరి రామ్ ఇంట్లో ఏసీబీ సోదాలు ముగిసిన అనంతరం ఆయనను పోలీసులు జడ్జి ముందు ప్రవేశపెట్టారు. విచారణ జరిపిన న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు. దీంతో ఆయనను చంచల్ గూడ జైలుకు తరలించారు. సుమారు రూ. 200 కోట్లకుపైగా అక్రమ ఆస్తులు కలిగి ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. హరి రామ్ ఇంటితోపాటు ఏకకాలంలో బంధువుల ఇళ్లల్లోనూ ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఏక కాలంలో 14 ప్రదేశాల్లో సోదాలు



నిర్వహించారు. గజ్వేల్‌లో భారీగా అక్రమాస్తులను అధికారులు గుర్తించారు. మార్కుర్‌లో 28 ఎకరాల భూమి, కొండాపూర్ షేక్‌పేట్, శ్రీనగర్, మాదాపూర్ ప్రాంతాల్లో ఖరీదైన ఫ్లాట్లను ఏసీబీ అధికారులు గుర్తించారు. పటాన్ చెరువులో 20 గుంటల భూమి, ఆరెకరాల మామిడి తోట, ఫామ్ హౌస్‌ను గుర్తించారు.కాళేశ్వరం ప్రాజెక్టు ఈఎన్‌సీ(ఇంజనీర్ ఇన్ చీఫ్) భూక్యా హరిరామ్ ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టు అయిన విషయం తెలిసిందే. కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ల మార్పు వ్యవహారంలో భారీ స్థాయిలో అవినీతి జరిగిందని, ఇందులో హరిరామ్ కీలకపాత్ర షోషించారనే ఆరోపణలు చాలాకాలంగా ఉన్నాయి. మరోపక్క, కాళేశ్వరం ప్రాజెక్టుపై జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ) నివేదిక ఇటీవల వెలువడింది. ఈ నేపథ్యంలో హరిరామ్ ఇల్లు, జలసౌధ కార్యాలయం, హరిరామ్ బంధువులు, స్నేహితులకు సంబంధించిన ఇళ్లు సహా 14 ప్రాంతాల్లో ఏసీబీ బృందాలు తనిఖీలు నిర్వహించాయి. ఈ సోదాల్లో ఏసీబీ అధికారులు కళ్లుచెదిరే ఆస్తులను గుర్తించారు. ఏసీబీ ప్రకటన ప్రకారం.. హరిరామ్‌కు మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ ఉన్న మర్కూక్ మండలంలోనే 28 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అలాగే, ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో వాణిజ్య స్థలం ఉంది.

# పోలీస్ ఫైరింగ్ రేంజ్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన

# మల్టిజోన్ రేంజ్ ఐజి చంద్రశేఖర్ రెడ్డి

**మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంటమే 02:** మెదక్ జిల్లా నార్సింగి గ్రామ శివారులో నూతనంగా ఏర్పాటు చేసిన పోలీస్ ఫైరింగ్ రేంజ్ శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం మల్టీ జోన్ ఐజి చంద్ర శేఖర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫైరింగ్ రేంజ్ సభా స్థలానికి చేరుకున్న ఐజి కి జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పుష్ప గుచ్చమిచ్చి ఘన స్వాగతం పలికారు, పరేడ్ నిర్వహించి గౌరవ వందనాన్ని సమర్పించారు, ఐజి గౌరవ వందనాన్ని స్వీకరించి. అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, శిక్షణ ప్రాంతంలో బుల్లెట్లు ఫైర్ చేసి ఫైరింగ్ రేంజ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐజి చంద్ర శేఖర్ రెడ్డి మాట్లాడుతూ మెదక్ పోలీస్ సిబ్బంది ఫైరింగ్ చేయుటకు సిద్దిపేట,సంగారెడ్డి జిల్లా ఫైరింగ్ రేంజ్‌కు వెళ్లాల్సి వచ్చేదని ,మెదక్ పోలీసులకు ఉపయోగకరంగా ఉండేందుకు నార్సింగి ఫైరింగ్ రేంజ్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఫైరింగ్ రేంజ్ ఏర్పాటుకు భూమి కేటాయించినందుకు కలెక్టర్ రాహుల్ రాజ్



కు కృతజ్ఞతలు తెలిపారు. ఫైరింగ్ చేస్తున్న సమయంలో చాలా జాగ్రత్తగా పాటించాలని ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా చూసుకోవాలని, ఫైరింగ్ శిక్షణ సమయంలో ఎవరిని కూడా ఈ ప్రాంతానికి రాకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని ఎవరికీ ఎలాంటి ప్రాణ ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని ఆయన సూచించారు,నార్సింగి ఫైరింగ్ రేంజ్ స్థలం రాళ్ళు రప్పల తో ఉన్న దానిని శ్రమించి ఎంతో అద్భుతంగా తీర్చిదిద్ది నందుకు జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి, ఏ.ఆర్ డీఎస్పీ రంగ నాయక్, తూప్రాన్ డీఎస్పీ వెంకట్ రెడ్డి, రామాయంపేట సీఐ వెంకట రాజా గౌడ్, స్థానిక ఎస్ఐ అహ్మద్ మోహిఉద్దీన్ లను అభినందించారు. పోలీస్ వ్యవస్థ ఉన్నంత వరకు ఈ ఫైరింగ్ రేంజ్ ఉపయోగంలో ఉంటుందని,ఉద్యోగ విరమణ సమయం దగ్గర పడుతున్నా ఎనలేని పట్టుదల తో తన ఉద్యోగ కాలంలో పోలీస్ వ్యవస్థ కు చిరకాలం గుర్తింపు ఉండే విధంగా ఫైరింగ్ రేంజ్ కోసం శ్రమించిన ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి ని ప్రత్యేకంగా అభినందించారు. ఫైరింగ్ రేంజ్ లో రేంజ్ డిసిప్లిన్ పాటించాలని ప్రజా సేవకు పోలీస్ అధికారులు, సిబ్బంది ఎప్పటి కప్పుడు తమ ఆయుధ నైపుణ్యాన్ని మెరుగు పరుచుకోవలని సూచించారు. స్థానిక తహశీల్దార్ షేక్‌కరీం మల్టీజోన్ చంద్రశేఖర్ రెడ్డికి పుష్పగుచ్ఛము అందజేశారు. ఈ కార్యక్రమం లో ఏఎస్పీ మహేందర్, మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్,8 సర్కిళ్ల సీఐలు,21 ఎస్ఐ,స్థానిక తహశీల్దార్ షేక్ కరీం, రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీధర్, సర్వేయర్ శ్రీకాంత్ పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

# మే డే స్ఫూర్తితో ఉపాధి హామీ కార్మికుల హక్కులను కాపాడుకుందాం

**ఉపాధి కార్మికులకు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్ల పంపిణి చుంచు రాజేందర్ డిబిఎఫ్ రాష్ట ఉపాధ్యక్షులు**

**మన ప్రజా ప్రతినిధి ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (సందెల రాజు):** ప్రపంచ కార్మికుల దినోత్సవం మే డే ను పురస్కరించుకొని ఉపాధి హామీ కార్మికుల హక్కులను కాపాడుకుంటునే ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించుకుందామని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్ కార్మికులకు పిలుపునిచ్చారు. శుక్రవారం హసన్‌పర్తి మండలం సీతంపేట గ్రామంలో మట్టి రోడ్ పనులు చేస్తున్న ఉపాధి హామీ కార్మికులతో పని వద్ద సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చుంచు రాజేందర్ మాట్లాడుతూ ఎండకాలం తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఉపాధి హామీ కార్మికులకు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లను పని వద్ద పంపిణి చేశారు. కార్మికుల కర్షకుల హక్కులను కాలరాసే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నాలుగు లెబర్ కోడ్ బిల్లులను రద్దు చేసి కార్మికుల హక్కులను



కాపాడాలన్నారు. కార్మికుల సంక్షేమం, అభివృద్ధి, రక్షణలను పట్టించుకోకుండా రోజు రోజుకు కొత్త చట్టాలు తీసుకువస్తూ, ఉపాధి హామీ కార్మికుల హక్కులకు భంగం కలిగిస్తున్నారని అన్నారు. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం ను పూర్తిగా తొలగించాలని,ఆధార్ యాప్ లాంటి జీవోలను సృష్టించి ఉపాధి చట్టాన్ని అడుగడుగున కేంద్రం ఉల్లంగిస్తుందని చుంచు రాజేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ కార్మికులకు పని వద్ద నీటి సరఫరా అందించాలని, వేసవి అలవేన్స్ పెంచాల న్నారు. ఉపాధి హామీ పని ప్రారంభమై ఇరవై యేండ్లు కావస్తున్న ప్రారంభ దశలో ఇచ్చిన పనిముట్లు తప్ప కొత్తగా నేడు ఇచ్చిన దాఖలాలు లేవని కూలీలకు పనిముట్లు అందించా లన్నారు. కొత్త కూలీ కుటుంబాలకు జాబ్ కార్డులు అందించా లన్నారు. ఆర్థిక సంవత్సరంలో వంద రోజుల నుండి రెండు వందల రోజుల పని దినాలను కల్పించాలన్నారు. రోజువారీ వేతనం 600 రూపాయ లకు పెంచాలన్నారు. క్షేత్ర సహాయకుల వేతనాలను గత నాలుగు నెలలుగా చెల్లించక పోవడం సరైంది కాదన్నారు. వెంటనే క్షేత్ర సహాయకుల వేతనాలు, ఉపాధి హామీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలన్నారుఈ కార్యక్రమంలో డిబిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు బౌతు రాధ, నాయకులు బౌతు భాగ్య,దుర్గం సారయ్య,క్షేత్ర సహాయకులు యం. తిరుపతి, ఆశ వర్కర్ మంత్రి రమ పెద్దఎత్తున ఉపాధి హామీ కార్మికులు పాల్గొన్నారు.

# మే 5 నుంచి 20 వరకు జిల్లాకు

# ఒక మండలంలో రెవెన్యూ సదస్సుల నిర్వహణ

**రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి పొంగులేటి**


**మే నెల చివరి వరకు ప్రతి దరఖాస్తు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలి**

**భూ సేకరణ జరిగిన భూముల వివరాలు అప్ డేట్ చేయాలి**

**నీట్ ప్రవేశ పరీక్ష నిర్వహణకు పటిష్ట కార్యాచరణ అమలు**

**అర్హుల కు ఇందిరమ్మ ఇండ్ల పథకం కేటాయించాలి**

**భూ భారతి చట్టం రెవెన్యూ సదస్సులు , ఇందిరమ్మ ఇండ్ల, నీట్ పరీక్ష నిర్వహణ పై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన మంత్రి పొంగులేటి**




**మన ప్రజా ప్రతినిధి ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (సందెల రాజు):** భూ భారతి చట్టం రూల్స్ ప్రకారం ప్రజల నుండి వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, సిసిఎల్ఏ కమీషనర్ నవీన్ మిట్టల్ లతో కలిసి భూ భారతి చట్టం రెవెన్యూ సదస్సులు, నీట్ ప్రవేశ పరీక్ష నిర్వహణ, ఇందిరమ్మ ఇండ్ల పై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, ఈ నెల 5 నుంచి మే 20 వరకు పైలట్ ప్రాజెక్టు జిల్లాలు మినహాయించి మిగిలిన జిల్లా లలో ఒక మండలాన్ని పైలట్ గా తీసుకొని గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యల పై ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకోవాలని మంత్రి సూచించారు. జూన్ 2 వరకు పైలట్ ప్రాజెక్ట్ క్రింద వచ్చిన దరఖాస్తులు పరిష్కారానికి కృషి చేయాలని మంత్రి తెలిపారు. పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టిన 4 మండలాల్లో రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యల పై ప్రజల నుంచి 12 వేల 759 దరఖాస్తులు వచ్చాయని అన్నారు. భవిష్యత్తులో జరిగే రాష్ట్ర వ్యాప్త రెవెన్యూ సదస్సులు సుమారు 15 లక్షల దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. భూ భారతి చట్టంలో దరఖాస్తు చేసుకునే సమయంలో సరిగ్గా దరఖాస్తు నమోదు అయ్యేలా హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రభుత్వ భూములలో పొజిషన్ ఉన్న రైతుల దరఖాస్తులు క్షుణ్ణంగా పరిశీలించాలని, భూమి లేని నిరుపేదలు పోజిషన్ లో ఉంటే వారికి పట్టాలు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి తో చర్చించి సాను కూలంగా నిర్ణయం తీసుకుంటామని మంత్రి తెలిపారు.

పట్టాలు ఉండి పొజిషన్ లో లేని దరఖాస్తులను కూడా పరిశీలించాలని అన్నారు. హై కోర్టు నుంచి అనుమతి రాగానే సాధా బైనామా దరఖాస్తులు పరిష్కారం చేయాలని, దీనికి అవసరమైన కార్యాచరణ పూర్తి చేయాలని మంత్రి సూచించారు. భూ సర్వే కు సంబంధించిన సమస్యలు, ఆర్.ఎస్.ఆర్ ఎక్సస్ సమస్యలు పరిష్కరించాలని, భూ సేకరణ కింద ప్రభుత్వం సేకరించిన భూముల రికార్డులు అప్ డేట్ చేయాలని మంత్రి కలెక్టర్ లను ఆదేశించారు. మే నెల చివరి వరకు రెవెన్యూ సదస్సులు వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి తప్పులు లేకుండా పరిష్కారం చూపాలని మంత్రి పేర్కొన్నారు.

గతంలో పంపిణీ చేసిన అసైన్డ్ భూముల పట్టాలు ఎవరైనా విక్రయిస్తే ముందు ఆ పట్టాలు రద్దు చేస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు చేసిన వారు భూమి లేని నిరుపేద లైతే ప్రభుత్వం చర్చించి ఎంత భూమి క్రమబద్ధీకరించాలి అనే అంశంపై నిర్ణయం తీసుకుంటామని అన్నారు. అటవీ భూముల వివాదాల పరిష్కారానికి కూడా కృషి చేయాలని అన్నారు. నీట్ పరీక్ష కేంద్రాలను ముందుగా జిల్లా కలెక్టర్, పోలీస్ ఉన్నతాధికారులు స్వయంగా పరిశీలించి ఏర్పాట్లు పర్యవేక్షించాలని అన్నారు. పరీక్ష కేంద్రాలకు త్రాగు నీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, ఓఆర్ఎస్ ప్యాకేట్లతో చిన్న మెడికల్ క్యాంపు, నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూసుకోవాలని అన్నారు. సీసీ కెమెరాలు, అవసరమైన మేర పోలీస్ భద్రత కల్పించాలని అన్నారు. ప్రశ్న పత్రాలు స్టోర్ చేసే స్ట్రాంగ్ రూం వద్ద సిసిటివి ఉండాలని, పోలీస్ బందోబస్తుతో పరీక్ష కేంద్రాలకు ప్రశ్నా పత్రాలను తరలించాలని అన్నారు. పరీక్ష కేంద్రాల గేటు మధ్యాహ్నం 1.30 గంటలకు మూసి వేయాలని, ప్రతి అభ్యర్థిని క్షుణ్ణంగా చెక్ చేసిన తర్వాత మాత్రమే పరీక్ష కేంద్రం లోపలికి అనుమతించాలని, బయో మెట్రిక్ అటెండెన్స్ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అర్బన్ పీఎం ఆవాస్ యోజన కింద లక్షా 13 వేల ఇండ్లు మంజూరయ్యాయని, ప్రతి నియోజకవర్గ పరిధిలోని పట్టణ ప్రాంతాలలో కనీసం 500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యేలా చూడాలని మంత్రి అన్నారు. పి.ఎం.ఎల్. ఏ పోర్టల్ లో లబ్ధిదారుల ధ్రువీకరణ ఆధార్ నెంబర్ లతో పూర్తి చేయాలని, దీని ద్వారా కేంద్ర ప్రభుత్వం నుంచి మనకు మొదటి విడత కింద 700 కోట్ల పైగా నిధులు వస్తాయని అన్నారు. 600 చదరపు అడుగులు కంటే ఎక్కువ విస్తీర్ణంలో నిర్మిస్తే మనకు కేంద్ర ప్రభుత్వం నిధులు రావని, లబ్ధిదారులకు వివరించి రెండవ దశలో 600 చదరపు అడుగుల లోపు కట్టేలా చూడాలని అన్నారు. పైలెట్ గ్రామాలలో మనం మంజూరు చేసిన 51 వేల ఇందిరమ్మ ఇండ్లలో ఇప్పటివరకు 10 వేల ఇంటి నిర్మాణాలు మాత్రమే ప్రారంభమయ్యాయని, 2019 ఇండ్లు బేస్మెంట్ పూర్తి చేసుకుంటే ఇటీవలే లక్ష రూపాయలు విడుదల చేశామని, ఇంటి నిర్మాణాలలో పురోగతి రావాల్సిందేనని, కలెక్టర్లు హౌసింగ్ శాఖపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. హౌసింగ్ కోసం ప్రత్యేకంగా ప్రతి మండలానికి అసిస్టెంట్ ఇంజనీర్లను ప్రభుత్వం కేటాయిస్తుందని అన్నారు. ప్రతిరోజు ఇంచార్జి మంత్రులతో సమన్వయం చేస్తూ అర్హుల జాబితా ప్రకటించి ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించాలని, మే 10వ తారీఖు లోపు పూర్తి స్థాయిలో ఇండ్లు గ్రౌండ్ చేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద వార్త పత్రికల్లో వచ్చే వ్యతిరేక వార్తలకు ఎప్పటి కప్పుడు రిజెండర్ జారీ చేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతి వివరాలు ఎప్పటి కప్పుడు ఆన్ లైన్ లో నమోదు చేయాలని,ప్రజలకు చెల్లింపులు సకాలంలో అందుతుం దని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు మాట్లాడుతూ, భూ భారతి చట్టం పైలెట్ ప్రాజెక్టు కింద వచ్చిన దరఖాస్తులను చట్టం ప్రకారం పరిష్కరించాలని సూచించారు. అధికారులు అందుబాటు లో ఉన్న సమయాన్ని దృష్టిలో ఉంచుకొని దరఖాస్తుల స్క్రూటినీ మార్గం సుగమం చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించి భూ భారతి సమస్యల పరిష్కారం చేపట్టాలని అన్నారు. మే 4న జరిగే నీట్ ప్రవేశ పరీక్ష నిర్వహణ పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అన్నారు. రాష్ట్రంలోనే 24 జిల్లాల పరిధిలో 190 పరీక్షా కేంద్రాలలో నీట్ ప్రవేశ పరీక్ష జరుగుతుందని , 72 వేల 507 అభ్యర్థులు పరీక్షలు హాజరయ్యే అవకాశం ఉందని అన్నారు. గతంలో జరిగిన ఎటువంటి పొరపాట్లు మరో సారి పునఃరావృతం కాకుండా జాగ్రత్తగా చర్యలు తీసుకోవాలని సిఎస్ కలెక్టర్లకు సూచించారు. నీట్ ప్రవేశ పరీక్షకు జిల్లా స్థాయిలో చేస్తున్న ఏర్పాట్ల గురించి అభ్యర్థులకు తెలిసే విధంగా పత్రికల, మీడియా ద్వారా ప్రచారం కల్పించాలని అన్నారు. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు ముందుగానే చేరుకునేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. పేదలకు ప్రభుత్వం అందించే శాశ్వత ఆస్తి ఇందిరమ్మ ఇండ్లని, ఇది ప్రభుత్వానికి అత్యంత ప్రతిష్టాత్మమైన కార్యక్రమం అని, అర్హుల జాబితా ఎంపిక చేయడం చాలా కీలకం అవుతుందని, అనర్హులకు పథకం అందితే ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని అధికారులు పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సి.ఎస్ పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలు, పట్టణ ప్రాంతాల్లో నిర్మించే ఇందిరమ్మ ఇండ్లకు కేంద్ర ప్రభుత్వం నుంచి కూడా మనకు సహాయం అందే విధంగా మార్గ దర్శకాలను పాటించాలని సిఎస్ అధికారులకు తెలిపారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య మాట్లాడుతూ జిల్లాలో 11 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, 4680 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు అవుతున్నారని,దీనికి సంబంధించిన శాఖల వారితో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశామని, విద్యార్థులకు సరిపోవు బయోమెట్రిక్ పరికరాలు ఏర్పాటు చేసినట్లు, పరీక్ష కేంద్రాలలో త్రాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లను ఏర్పాటు చేశామన్నారు, పరీక్షా కేంద్రాల వద్ద విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని అధికారులును ఆదేశించారు ఈ వీడియో సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, జిల్లా గృహ నిర్మాణ శాఖ పిడి రవీందర్, కాజీపేట మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రవీందర్, జిల్లా ల్యాండ్ సర్వే అధికారి శ్రీనివాసులు, నడికూడ తహసీల్దార్ నాగరాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వేసవి శిక్షణా శిబిరాన్ని ప్రారంభించిన ఏం.ఈ.ఓ గంగా బాయి




**మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట, మే 2 :** ఉచిత వేసవి శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి గంగా బాయి అన్నారు. మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేసవి శిక్షణా శిబిరాన్ని శుక్రవారం ప్రారంభించిన సందర్భంగా గంగా బాయి మాట్లాడుతూ సమగ్ర శిక్ష, డైరక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ సంయుక్తంగా నిర్వహించే ఉచిత వేసవి శిక్షణా శిబిరాన్ని మండలం లోని అన్ని గ్రామాల విద్యార్థులు సద్వినియోగ పరుచుకోవాలని అన్నారు. మే 1 నుంచి 15 వరకు నిర్వహించే శిబిరంలో 6 నుంచి 9 వ తరగతి విద్యార్థులకు ఉదయం 8 నుంచి 11 గం వరకు కంప్యూటర్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, ఎడ్యుకేషన్, ఇండోర్ గేమ్స్, యోగా, మెడిటేషన్ పై శిక్షణ ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శర్మ, స్వామి, శశికళ, సాయి, నవీన, బాల గౌడ్, దావూద్, సుస్మిత విద్యార్థులు పాల్గొన్నారు.

# సభ్యత భీమా చెక్కును అందజేసిన దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



**మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ చేగుంట , మే 2 :** రోడ్డు ప్రమాదంలో మరణించిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త భార్య కు పార్టీ సభ్యత్వ బీమా చెక్కును దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అందజేశారు. గత కొద్ది కాలం క్రితం మండల పరిధిలోని నర్సంపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు పైతరి అంజయ్య రోడ్డు ప్రమాదంలో మరణించారు. నేడు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పైతరి అంజయ్య భార్య శాంతమ్మ,కు రెండు లక్షల పార్టీ సభ్యత్వ బీమా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ అంజయ్య మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. అంజయ్య మరణించినా పార్టీ ఆయన కుటుంబానికి అండగా నిలిచిందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు, నాయకులకు, ప్రజలకు ఎల్లప్పుడూ తొడుంటుందని అన్నారు. అధికారంలో ఉన్నా ప్రతిపక్షం లో ఉన్న ఎల్లప్పుడూ బాధితుల పక్షంలో నిలిచే ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని బీమా చెక్కును అందజేసిన ఎమ్మెల్యే, మంజూరుకు కృషి చేసిన మండల నాయకులకు శాంతమ్మ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మైలారం బాబు, పార్టీ పెద్ద తాండా అధ్యక్షుడు భాషా నాయక్, మంచి కట్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# రుద్రమూర్తికి విశేష పూజలు







**శ్రీశైలం మే 2 (మన ప్రజా ప్రతినిధి):** లోకకల్యాణం కోసం ఆలయ ఈశాన్య భాగంలో గల రుద్ర వనములోని (రుద్రపార్కులోని) రుద్రమూర్తికి శాస్త్రోక్తంగా పూజాదికాలు జరిపించబడ్డాయి. ఈ రుద్రమూర్తి విగ్రహాన్ని గతంలో వైశాఖ మాసములో నెలకొల్పడం జరిగింది. ఈ కారణంగా ప్రతి సంవత్సరం వైశాఖ మాసములో ఆరుద్రా నక్షత్రం రోజున ఈ రుద్రమూర్తికి ప్రత్యేక పూజాది కాలు జరిపించబడుతున్నాయి. కాగా ఈ రోజు ఉదయం జరిగిన పూజాదికాలలో ముందుగా లోక సంక్షేమాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. ఈ సంకల్పంలో దేశం సుభిక్షంగా ఉండాలని, సకాలంలో తగినంత వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, ప్రకృతి వైపరీత్యాలు నివారించబడాలని, దేశంలో సుఖశాంతులు విలసిల్లాలని, అకాల మరణాలు సంభవించకుండా ఉండాలని, జనులందరికీ సుఖసంతోషాలు కలగాలని పేర్కొనబడింది. తరువాత రుద్రమూర్తికి అభిషేకం నిర్వహించబడింది. అర్చకులు రుద్రమంత్రాలను పఠిస్తుండగా శాస్త్రోక్తంగా పంచామృతాలతోనూ, గంధోధకం, భస్మోదకం, పుష్పోదకం, బిల్వోదకం, సుగంధోదకాలతోనూ,ఆ తరువాత జలంతోనూ ఈ అభిషేకం నిర్వర్తించబడింది. అనంతరం రుద్రదేవునికి బిల్వార్చనను జరిపి పుష్పార్చన చేయబడింది. ఈ పుష్పార్చనలో వివిధ రకాల పుష్పాలు వినియోగించబడ్డాయి. రుద్రదేవుని చల్లని చూపులు ఎల్లప్పుడు కృష్ణానదిపై ప్రసరించడం వలన కృష్ణానదిలో నీరు సమృద్ధిగా ఉండి, పంటలు బాగా పండుతాయని, అదే విధంగా శ్రీశైలం ఆనకట్ట ఎల్లప్పుడూ పరిరక్షించబడుతూ ఉంటుందని పలువురు ఆధ్యాత్మికవేత్తలు సూచించడంతో ఆలయ ఈశాన్యభాగంలో కృష్ణానదికి అభిముఖంగా (రుద్రుని దృష్టి కృష్ణానదిపై పడే విధంగా) ఈ రుద్రుని విగ్రహాన్ని దేవస్థానం నెలకొల్పింది. ఈ కార్యక్రమములో డిప్యూటీ కార్యనిర్వహణాధికారి ఆర్. రమణమ్మ, సహాయ కమీషనర్ ఇ. చంద్రశేఖరరెడ్డి, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీరు ఎం. నరసింహారెడ్డి, అర్చకులు, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా స్వర్ణ రథోత్సవం





**శ్రీశైలం మే 2 (మన ప్రజా ప్రతినిధి):** ఆరుద్రా నక్షత్రాన్ని పురస్కరించుకుని (02.05.2025) శ్రీస్వామిఅమ్మవార్లకు స్వర్ణరథోత్సవం నిర్వహించబడింది. కాగా ఆరుద్రోత్సవంలో భాగంగా ఈ రోజు వేకువజామున శ్రీస్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేషపూజలు నిర్వహించబడ్డాయి. అనంతరం స్వర్ణరథోత్సవం జరిపించబడింది. ఈ స్వర్ణరథోత్సవంలో ముందుగా అర్చకస్వాములు లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. తరువాత రథారూఢులైన శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషపూజలు జరిపించబడ్డాయి. అనంతరం ఉదయం గం. 7.30లకు ఈ స్వర్ణరథోత్సవం ప్రారంభమైంది.

గంగాధర మండపం నుంచి నందిమండపం వరకు తిరిగి అక్కడి నుండి గంగాధర మండపం వరకు ఈ రథోత్సవాన్ని జరిపించడం జరిగింది. సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా రథోత్సవంలో పలు కళా బృందాల కోలాటం, డోలు వాయిద్యం మొదలైన జానపద కళారూపాలు కూడా ఏర్పాటు చేయబడ్డాయి. ఈనాటి స్వర్ణరథోత్సవంలో డిప్యూటీ కార్యనిర్వహణాధికారి వి. రమణమ్మ, సహాయ కమీషనర్ ఇ. చంద్రశేఖరరెడ్డి, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీరు ఎం. నరసింహారెడ్డి, పర్యవేక్షకులు ఎం. మల్లికార్జున, అర్చకస్వాములు, వేదపండితులు, పర్యవేక్షకులు, తదితర సిబ్బంది. శివసేవకులు పాల్గొన్నారు.

# నీట్ పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు

**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**




**మన ప్రజా ప్రతినిధి ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (సందెల రాజు):**ఈ నెల 4 వ తేదీ ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల నుండి 5 గంటల వరకు జరగనున్న నీట్ ప్రవేశ పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ శుక్రవారం తెలిపారు.వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధి లో మొత్తం 13 పరీక్షా కేంద్రాలు వున్నాయి. ఇందులో వరంగల్, హన్మకొండ కలుపుకొని 11, జనగాం 2 వున్నాయి.ఈ ప్రవేశ పరీక్షకు మొత్తం 5,260 మంది అభ్యర్థులు పరీక్ష రాస్తున్నారు, ఇందులో వరంగల్, హన్మకొండ పరిధిలో 4680 మంది విద్యార్థులు పరీక్ష రాస్తుండగా, జనగామ జిల్లాలో 580 మంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నారు, ముఖ్యంగా మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష జరిగే కేంద్రాల వద్ద పటిష్టమైన ఏర్పాట్లు చేయడం జరిగిందని అలాగే పరీక్షా కేంద్రాల వద్ద 163 బిఎన్ఎస్ ఎస్ అమలులో ఉంటుంది. కావున పరీక్ష కేంద్రాల పరిసరాల్లో ఊరేగింపులు, ర్యాలీ లు, ధర్నాలు, గుంపులు తిరగడం నిషేధించ బడ్డాయని, పరీక్ష పరిసరాల్లో జిరాక్స్ సెంటర్లను మూసి వేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు.

# పేదింటి ఆడపడుచు లకు అండగా కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్...

**పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం..**




**మన ప్రజా ప్రతినిధి ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (సందెల రాజు):**సీఎం సహాయ నిధి పేదలకు పెన్నిదని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. శుక్రవారం హనుమకొండ సుబేదారి లోని ఎమ్మెల్యే నివాస క్యాంపు కార్యాలయం నందు హసన్ పర్తి మండల మరియు 1, 2, 55, 56, 65, 66 డివిజన్లకు సంబందించిన కళ్యాణ లక్ష్మీ, షాధీ ముబారక్ 37 మంది లబ్ది దారుల కు 37 లక్షల 3 వేల 712 రూపాయల విలువ గల చెక్కలను మరియు 55 వ డివిజన్ కు సంబంధించిన 6 మంది లబ్ధిదారులకు రూ.1లక్ష 74వేల 500 రూపాయల విలువ గల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను వర్ధన్నపేట ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు. అనం తరం ఎమ్మెల్యే మాట్లాడుతూ..కాంగ్రెస్ పేదల ప్రభుత్వమని,రాష్ట్రంలోని పేద వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో హసన్ పర్తి మండల మరియు 1, 2, 55, 56, 65, 66 డివిజన్ల ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల, డివిజన్, గ్రామ పార్టీ నాయకులు కార్యకర్తలు వివిధ అనుబంధ సంఘాల నాయకులు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.ం

# మొమ్మెల.ముని బాబు కి డాక్టరేట్





JAWAHARLAL NEHRU TECHNOLOGICAL UNIVERSITY ANANTAPUR
ANANTHAPURAMU - 515 002, ANDHRA PRADESH, INDIA
Adm. No.14PH0524 Sl. No. PC 0428793
Aadhaar No: XXXXXXXX9415
PROVISIONAL CERTIFICATE
This is to certify that Mr. MUMMELA MUNI BABU
Son of Sri M CHINNA MUNEIAH &
Smt MUMMELA NAGAMMA,
has satisfied all the requirements for the award of
*** DOCTOR OF PHILOSOPHY ***
in the faculty of *** Computer Science & Engineering ***
for the Thesis entitled,
" VIDEO TRANSMISSION SCHEMES TO IMPROVE QoS IN WIRELESS NETWORKS "
(Date of Viva Voce : 23.04.2025)
Thursday, 1 May, 2025.
REGISTRAR

**లింగాల మన ప్రజాప్రతినిధి న్యూస్:**పులివెందుల నియోజక వర్గం లింగాల మండలం కామ సముద్రం గ్రామానికి చెందిన మొమ్మెల నాగమ్మ, చిన్న మునెయ్య ల కుమారుడు మునిబాబు ఇడుపుల పాయ ట్రిపుల్ ఐటి లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం లో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న మొమ్మెల ముని బాబు జె.ఎన్. టి.యు. అనంతపూర్ లో వీడియో ట్రాన్స్మిషన్ స్కీమ్స్ టు ఇంప్రూవ్ క్వాలిటీ ఆఫ్ సర్వీస్ ఇన్ వైర్ లెస్ నెట్ వర్క్ నందు సాధించిన డాక్టరేట్ పట్టా ను అనంతపురం జె ఎన్ టి యు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి చేతులమీదుగా శుక్రవారం డాక్టరేట్ పట్టాను మునిబాబు కి అందజేశారు.జె.ఎన్.టి.యు అనంతపూర్ యూని వర్సిటీ నందు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం లో పని చేస్తున్న ప్రొఫెసర్ పాకనాటి చెన్నారెడ్డి మరియు కర్నూలు జి. పుల్లా రెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం లో ప్రొఫెసర్ గా పని చేస్తున్న రాచపూడి ప్రవీణ్ శ్యామ్ సంయుక్త ఆధ్వర్యం లో పి.హెచ్.డి పూర్తి చేశారు. ఈ సందర్భంగా ట్రిపుల్ ఐటి లోని డైరెక్టర్, సిబ్బంది మరియు విద్యార్థిని విద్యార్థులు మొమ్మెల ముని బాబు కి డాక్టరేట్ వచ్చిన సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు.మొమ్మెల ముని బాబు పులివెందుల నియోజకవర్గం లింగాల మండలం కామసముద్రం గ్రామంలో స్వర్గీయ మొమ్మెల చిన్న మునెయ్య మరియు మొమ్మెల నాగమ్మ గారి కుమారుడు.డా. మొమ్మెల.ముని బాబు

# మండే ఎండల్లో చల్లచల్లగా




**లింగాల మన ప్రజాప్రతినిధి న్యూస్:** ఎండా కాలంలో చల్లని పానీయాలు తాగడం వల్ల శరీరానికి ఉపశమనం లభిస్తుంది వేడిని తట్టుకోవడానికి, నీరశుద్ధిని నిర్వహించడానికి చల్లని పానీయాలు సహాయపడతాయి.అయితే,కొన్ని పానీయాలు శరీరానికి హానికరంగా కూడా ఉండవచ్చు. కాబట్టి, జాగ్రత్తగా పానీయాలను ఎంచుకోవడం ముఖ్యం.ఎండాకాలంలో చల్లని పానీయాలు తాగడం వల్ల కలిగే ప్రయోజనాలు:శరీరం చల్లబడటం:ఎండాకాలంలో శరీరం వేడెక్కినప్పుడు, చల్లని పానీయాలు తాగడం వల్ల శరీర ఉష్ణోగ్రత తగ్గుతుంది.నీరశుద్ధి నిర్వహణ: చల్లని పానీయాలు తాగడం వల్ల శరీరంలో నీరశుద్ధి నిర్వహించబడుతుంది.వేడిని తట్టుకోవడం: చల్లని పానీయాలు శరీరానికి ఉపశమనం కలిగిస్తాయి, వేడిని తట్టుకోవడానికి సహాయపడతాయి. ఎండాకాలంలో చల్లని పానీయాలు తాగడం వల్ల కలిగే నష్టాలు:శరీరానికి హాని:కొన్ని చల్లని పానీయాలు,ముఖ్యంగా శుభ్రత లేనివి,శరీరానికి హానికరంగా ఉండవచ్చు.జీర్ణక్రియ సమస్యలు: చాలా చల్లని పానీయాలు జీర్ణక్రియ సమస్యలను కలిగిస్తాయి.తలనొప్పి:కొన్ని చల్లని పానీయాలు తలనొప్పికి కారణం కావచ్చు. ఎండాకాలంలో తాగడానికి మంచి పానీయాలు:నీరు:సాధారణ నీరు తాగడం శరీరానికి చాలా అవసరం.కొబ్బరి నీరు:కొబ్బరి నీరు ఎలెక్ట్రోలైట్లను కలిగి ఉంటుంది, ఇది శరీరానికి చాలా అవసరం.పుచ్చకాయ రసం:పుచ్చకాయ రసం శరీరానికి చల్లదనాన్ని కలిగిస్తుంది.మజ్జిగ:మజ్జిగ జీర్ణక్రియకు సహాయపడుతుంది మరియు శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తుంది.ఫలాల రసాలు:తాజా పండ్ల రసాలు శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తాయి. ఎండాకాలంలో చల్లని పానీయాలు తాగడం వల్ల శరీరానికి ఉపశమనం లభిస్తుంది. అయితే, అన్ని పానీయాలు శరీరానికి ఒకే విధంగా ఉపయోగపడవు. కాబట్టి, జాగ్రత్తగా పానీయాలను ఎంచుకోవడం ముఖ్యం. శుభ్రమైన పానీయాలు తాగడం వల్ల శరీరానికి హాని కలుగదు, జీర్ణక్రియ కూడా మెరుగుపడుతుంది.

# టెన్త్ కడపజిల్లా టాపర్ జోషికకు ఉపాధ్యాయుల ఘనసన్మానం

**మారుమూల గ్రామాల్లోని మట్టిలోమాణిక్యాలను వెలికితీయాలి మండల విద్యాశాఖాధికారులు**





**లింగాల మన ప్రజాప్రతినిధి న్యూస్:**మారుమూల గ్రామాలలో కొంతమంది ప్రతిభావంతులైన విద్యార్థులు ఉంటారని, వారిలో దాగివున్న అంతర్గత నైపుణ్యాలను వెలికితీస్తే, దేశానికి ఉపయోగపడే శాస్త్రవేత్తలను, ఐఏఎస్ అధికారులను, ప్రముఖ క్రీడాకారులను తయారు చేయవచ్చని, మట్టిలోఉన్న మాణిక్యాల ను గుర్తించడం ఉపాధ్యాయుల బాధ్యతఅని, సానపట్టిన వజ్రం ప్రకాశవంతంగా తయారవుతుందని, ఉపాధ్యాయులు ఈదిశగా ప్రయత్నించి దేశానికి కీర్తితెచ్చే అబ్దుల్ కలాం లాంటి వ్యక్తులను తయారు చేయాలని మండల విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు.ఇటీవల వెలువడిన పదవతరగతి ఫలితాల్లో సింహాద్రిపురం మండలం రావులకొలను జిల్లాపరిషత్ హైస్కూలు విద్యార్థిని పల్లేటి జోషిక 595 మార్కులు సాధించి, ప్రభుత్వ పాఠశాలల విభాగంలో జిల్లా ఫస్ట్ ర్యాంక్, అదేవిధంగా రాష్ట్రస్థాయిలో మూడవ ర్యాంకు సాధించిన సందర్భాన్ని పురస్కరించుకొని, స్థానిక మార్కెట్ ఆంజనేయస్వామి గుడివద్ద ఉన్న పులివెందుల వైయస్సార్ టీచర్స్ అసోసియేషన్ రీజినల్ కార్యాలయంలో సీకే వెంకటనాథరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో మండల విద్యాశాఖ అధికారులు, హెడ్మాస్టర్లు ఉపాధ్యాయులు పాల్గొని టెన్త్ టాపర్ జోషికను దుశ్శాలువతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందించారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులు ప్రతిభావంతురాలైన విద్యార్థిని ఉన్నతవిద్య కోసం 15 వేల రూపాయలు ఆర్థికసహాయం అందించారు.ఈ సందర్భంగా జోషిక మాట్లాడుతూ, తాను సుంకేసుల గ్రామానికి చెందిన పల్లేటి హరినాథరెడ్డి, హేమలత దంపతులకు నిరుపేద కుటుంబంలో జన్మించానని, తల్లిదండ్రుల ప్రోత్సాహం, రావులకొలను హైస్కూల్ హెడ్మాస్టర్ అంకన్న నిరంతర పర్యవేక్షణ, పాఠశాల ఉపాధ్యాయుల అవిరళ కృషి, తన కఠోరశ్రమ వలన తాను ఈరోజు 595 మార్కులు సాధించి, టాపర్ గా నిలిచానని, ట్రిపుల్ ఐటీ నూజివీడులో ఇంజనీరింగ్ పూర్తిచేసి, సివిల్స్ రాసి కలెక్టరుగా, జిల్లాఉన్నతాధికారిగా పనిచేసి, ప్రజాసేవ చేయాలననేది తన ఆశయమని, తనవిజయానికి అన్నివిధాలా సహకరించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సహచరుల తోడ్పాటును తనజీవితంలో ఎప్పటికీ మరువలేనని పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో పులివెందుల మండల విద్యాశాఖాధికారులు చంద్రశేఖరరావు, రామానాయుడు,లింగాల మండల విద్యాశాఖాధికారులు శ్రీనివాసులురెడ్డి, రామకృష్ణయ్య, తొండూరు సీనియర్ ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, వైయస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ సికె వెంకటనాథరెడ్డి, రావులకొలను హైస్కూలు ఉపాధ్యాయుడు ఈశ్వరరెడ్డి పులివెందులశాఖ గౌరవాధ్యక్షులు వెంకటరెడ్డి, గోపాల్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు ప్రభాకర్ రెడ్డి, సురేష్ రెడ్డి, రఘునాథరెడ్డి, పవన్, ఓబుల్ రెడ్డి, జగన్, కరుణాకర్ రెడ్డి, మదార్, ఈశ్వరయ్య, సతీష్, సుదర్శన్ వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# మేడే సందర్భంగా ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ



**సత్తుపల్లి మన ప్రజాప్రతినిధి న్యూస్ మే 02:**ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం రామ గోవిందపురం గ్రామంలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో 120 మందికి ఉపాధి కూలీలతో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం సాగుతున్న పోరాటాలకు గుర్తుగా జరుపుకునే మేడే రోజున అన్నపనేని రాంబాబు సహకారంతో ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ చేయడం మానవత విలువలకు నిలువెత్తు నిదర్శమని ప్రశంసించారు. మండలంలోని పలు గ్రామాల్లో అర్హులకు ఇందిరమ్మ ఇళ్ల జాబితాలలో పేర్లు లేకుండా అధికార పార్టీ నాయకులు తమకు అనుకూలంగా ఉన్నవారికి ఇల్లు ఎంపిక చేయడం దుర్మార్గం అన్నారు. భూములు ఇంతకుముందే ఇల్లు ఉన్నవారికి మరల ఇల్లు కేటాయించడం మంచి పద్ధతి కాదన్నారు, పార్టీల వారీగా చూడకుండా అరులైన వారికి ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధి పనుల వద్ద మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు అయినం పూడి సనందన్ రావు, లక్ష్మణరావు, నాగమణి, మల్లేశ్వరి, మంగమ్మ,రాణి, రాఘవులు, చెన్నారావు, వెంకట్రావు, ప్రమీల, కుమారి తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనులు సాగు చేసుకుంటున్నా పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి:సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ



**సత్తుపల్లి మన ప్రజాప్రతినిధి న్యూస్ మే 02:**గత 35 సంవత్సరాలుగా చెరుకు పల్లి లో తుమ్మల నగర్ కు చెందిన గిరిజనులు పోడు కొట్టి సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యు లు దండు ఆదినారాయణ డిమాండ్ చేశారు.2005 కంటే ముందు నుండి గిరిజనులు పోడు భూములు సాగు చేసుకుంటున్నారని అట్టి భూములను ఫారెస్ట్ అధికారులు గిరిజనులకు చెందకుండా ఇబ్బంది పెడుతున్నారని గిరిజనులపై అక్రమ కేసులు బనాయించి వాళ్లను కోర్టుల చుట్టూ తిప్పుతున్నారని గత బిఆర్ఎస్ ప్రభుత్వం గిరిజనులను మోసం చేసిందని ఫారెస్ట్ అధికారులు ఉసిగొలిపి గిరిజనులను ఇబ్బంది పెట్టారని ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని గిరిజనుల భూములకు పట్టాలు ఇవ్వాలని దండు ఆదినారాయణ డిమాండ్ చేశారు. గిరిజన భూములు పేదల భూములు ఎస్సీ ఎస్టీల భూములు గత ప్రభుత్వం మిషన్ కాకతీయ పేరుతో పల్లె ప్రకృతి వనాల పేరుతో పేదలు సాగు చేసుకునే భూములు ఊడగొట్టి పేదలు ఉసురుపోసుకున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం జోక్యం చేసు కొని గిరిజనులకు పోడు పట్టాలు ఇవ్వాలని దండు ఆదినారాయణ డిమాండ్ చేశారు.ఈ కార్య క్రమంలో సిపిఐ మండల కమిటీ సభ్యులు తాటి వీరభద్రం చెరుకుపల్లి శాఖ కార్యదర్శి గడ్డం కృష్ణయ్య సహాయ కార్యదర్శి తారబోయిన రాజు వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు తాటి రాజు తాటి చిన్న వీరభద్రం మహిళా సమైక్య నియోజకవర్గ కన్వీనర్ ఎస్ కే రంజాన్ బి డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్కే హమీద్ బి అజయ్ ఎస్ కే లాల్ మహమ్మద్ తాటి కుమారి తాటి రాజమ్మ గడ్డం తిరుపతమ్మ భద్రమ్మ రాధ గడ్డం వెంకటేష్ తారబోయిన రాజమ్మ పాల్గొన్నారు

# శ్రీ కృప కళాశాలలో వార్షికోత్సవాలు






**మన ప్రజా ప్రతినిధి కొండపాక మండల్:**ప్రపంచంలో అన్నిటి కన్నా విలువైనది సమయం మాత్రమేనని, ప్రతి ఒక్కరూ సమయ పాలన పాటించాలని, అప్పుడే జీవితంలో విజయం సాధించగలరని సిద్దిపేట ప్రభుత్వ కళాశాల సూపరింటెండెంట్ శాంతి తెలిపారు. కొండపాక మండలం వెలికట్ట శ్రీకృప ఫార్మాసి కళాశాలలో శుక్రవారం జరిగిన వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నేటి తరం యువత మొబైల్ ఫోన్లు వాడుతూ తమ లక్ష్యాలను మర్చిపోయి చెడు వ్యసనాలకు బానిసలుగా మారిపోతున్నారని కృషి, పట్టుదల ఉంటేనే విద్యార్థులు భవిష్యత్తులో విజయం సాధించగలరని తెలిపారు. మరి కొంత మంది మందు, సిగరెట్ లో ఆనందం ఉందనుకుంటున్నారని తెలిపారు. విద్యార్థులు ఓపిక, ప్రశాంతంగా ఉన్నప్పుడే అన్నీ సాధించగలరని వాటికి దూరంగా ఉంటే నిరాశ నిస్పృహలకు లోనై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మల్లారెడ్డి ప్రిన్సిపల్ మంజునాథ్ అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# విలువలతో కూడిన విద్య నేర్పండి:విశ్వశాంతి విద్యార్థులకు సత్తుపల్లి సీఐ అభినందన



**సత్తుపల్లి మన ప్రజాప్రతినిధి న్యూస్ మే 02:**పదవ తరగతి పరీక్షా ఫలితాలలో అత్యుత్తమ మార్కులు సాధించిన విశ్వశాంతి విద్యార్థులను సత్తుపల్లి సిఐ కిరణ్ అభినందించారు.వారిలో అర్షియా ( 569), గీతాశ్రీ (558), అపర్ణ(556),యోచిత (550) ఉన్నారు.విశ్వశాంతి లోజరిగిన అభినందన కార్యక్రమంలో సీఐ కిరణ్ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ... విలువలతో కూడిన విద్యను అందించాలని సూచించారు.విద్యార్థుల కృషికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహం తోడైతే వారు భవిష్యత్తులో ఉన్నతంగా రాణిస్తారని పేర్కొన్నారు.సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ కృషి,పట్టుదలతో శ్రమిస్తే ఆశించిన లక్ష్యాన్ని చేరుకోవచ్చని అన్నారు. కొద్దిమంది విద్యార్థులతో ఉన్నత ఫలితాలు సాధించడం అభినందనీయం అన్నారు. విశ్వశాంతి ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వరరావు మాట్లాడుతూ... మొత్తం 18 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా వారిలో 12 మంది 500 పైగా మార్కులు సాధించారని అన్నారు. 100% శాతం ఉత్తీర్ణతతో పాటు 67% మంది విద్యార్థులు 500 కు పైగా మార్కులు సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో విశ్వశాంతి యాజమాన్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఘనంగా జరిగిన బోయినపల్లి రవి' పదవీ విరమణ కార్యక్రమము



**సత్తుపల్లి మన ప్రజాప్రతినిధి న్యూస్ మే 02:**ఆరోఆదనపు జిల్లా జడ్జి'మారగాని శ్రీనివాస్, " సీనియర్ సివిల్ జడ్జి 'మీరా ఖాసీం" ముఖ్య అతిధులుగా, సత్తుపల్లి బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మల్లెపూల వెంకటేశ్వరరావు, జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆర్. శ్రీనివాస్ రాజుల అధ్యక్షతన,"ఆరో అదనపు జిల్లా జడ్జి కోర్టు" C.A.Oముఖ్య పరిపాలనాధికారి బోయినపల్లి రవి' పదవీ విరమణమహోత్సవ సభ, స్థానిక కోర్టు ప్రాంగణములో ఘనంగా జరిగింది. (30.4.25), బోయినపల్లి రవి గత 38 సంవత్సరముల ఉద్యోగ కాలములో, ఆయనతో కలిసి పనిచేసిన సహోద్యోగులు, ఖమ్మం, వరంగల్ జిల్లా సుదూర ప్రాంతాలనుండి వచ్చి హాజరై, ఆయన పరిపాలనా దక్షత, నీతి, నిజాయితీలను కొనియాడుతూ, ఆయనలో గొప్ప మానవతావాది కూడా వున్నారని, ఈ అనంద సమయాన, ఆయన సతీమణి అనారోగ్యానికి గురికావడం. మా మనసుల్ని కలచివేసిందని, అయినా వారిదువురు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో కలిసి వుండాలని ఆకాంక్షించారు, న్యాయ మూర్తులు, ఉద్యోగులు, మిత్రులు, అభిమానులు" "బోయినపల్లి రవి'ని పూల దండలు, శాలువాలతో ఘనంగా సత్కరించి , మీ సేవలు న్యాయదేవతకు ఏదోరూపంలో అందించాలని ఆకాంక్ష వ్యక్తపరిచారు , పెనుగొండరమేష్, చీళ్ళ నాగేశ్వరరావు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

# మహిళా చట్టాలపై అవగాహన కల్పిస్తూ రక్షణాగా నిలుస్తున్న హుస్నాబాద్ షీటీమ్ బృందం

**మహిళల రక్షణకు పెద్దపీట వేయడం జరుగుతుంది**






**మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,చేర్యాల, జనగామ నియోజకవర్గం:**చేర్యాల పట్టణంలో ప్రజలకు మహిళలకు మహిళల రక్షణకు ఉన్న చట్టాల గురించి, షీటీమ్ నిర్వహిస్తున్న విధుల గురించి, షీటీమ్ ద్వారా ఎలా రక్షణ పొందొచ్చు అనే అంశాల గురించి, ర్యాగింగ్/ ఈవిటీజింగ్/ పోక్సో/ షీ టీమ్స్/ యాంటీ హ్యూమెన్ ట్రాఫికింగ్ సైబర్ నేరాలు,నూతన చట్టాల గురించి, మరియు అపరిచిత వ్యక్తుల యొక్క ఫోన్ కాల్స్ మరియు మాటలు నమ్మవద్దు, సోషల్ మీడియాకు ఎంత దూరం ఉంటే భవిష్యత్ అంత మంచిగా ఉంటుంది మహిళల భద్రతకు ఎల్లవేళలా అందుబాటు లో ఉంటాం మహిళల భద్రత మా ముఖ్య బాధ్యత. గంజాయి, డ్రగ్స్ మరియు ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు,పిల్లలను వేసవికాలం అయినందున ఎటుపడితే అటు మరియు ఈతకు పంపవద్దని సూచించారు.రాత్రి సమయాలలో ఇంటికి తాళం వేసి ఇంటి ముందర లేదా డాబాపై పడుకునే అలవాటు ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మహిళలు వ్యవసాయ పనులపై ఒంటరిగా వెళ్లేటప్పుడు వంటిపై బంగారం ఉంటే దొంగతనం జరిగే అవకాశం ఉంటుంది జాగ్రత్త పడాలి మహిళలను ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మరియు అవహేళనగా మాట్లాడిన వెంటనే డయల్ 100 లేదా సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ షీటీమ్ నెంబర్ 8712667434 నెంబర్ కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సమాచార అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు.అవగాహన కల్పించిన హుస్నాబాద్ షీటీమ్ బృందం హెడ్ కానిస్టేబుల్ సదయ్య మహిళ కానిస్టేబుళ్లు ప్రశాంతి, స్వప్న, కానిస్టేబుల్ కృష్ణ, మరియు సిడిపిఓ సూపర్వైజర్ రమ, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు

# మోడీ చిత్రపటానికి పాలాభిషేకం

**నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షురాలు చల్ల శ్రీలతరెడ్డి...**





**మనప్రజాప్రతినిధి//హుజూర్ నగర్:**భారత ప్రధాని గౌరవనీయులు శ్రీ నరేంద్ర మోడీ గారు దేశవ్యాప్తంగా జనగణనతో పాటు కులగణన చేపట్టాలని కేంద్ర క్యాబినెట్ లో తీసుకున్న నిర్ణయంను స్వాగతిస్తూ బిజెపి గరిడేపల్లి మండల పార్టీ అధ్యక్షులు కుక్కడపు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ గారి చిత్ర పటానికి పాలాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది...ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలు చల్ల శ్రీలతరెడ్డి గారు పాల్గొని మోదీ గారి చిత్ర పటానికి పాలాభిషేకం చేసారు...ఈ సందర్భంగా చల్ల శ్రీలతరెడ్డి గారు మాట్లాడుతూ కాంగ్రెస్ చేసిన బీసీ జనగణనకు శాస్త్రీయత లేదు, బీసీ జనాభా తగ్గించి చూపించారని, కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ జనగణన చేయలేదు కానీ ఇప్పుడు చేయాలని డిమాండ్ చేయడం సిగ్గుచేటుగా భావిస్తున్నానని అన్నారు... మోదీ గారు మాట ఇస్తే దేశమంతా నమ్ముతుందనీ, కేంద్రం చేసే కులగణన బీసీలలో రాజకీయ, సామాజిక, ఆర్థిక, విద్యా పరంగా అలాగే వరంగా మారుతుందని, నిజమైన సామాజిక న్యాయం అందిస్తున్న పార్టీ ఒక్క బీజేపీ పార్టీయే అని అన్నారు...ఇట్టి కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ నర్సింగ్ అంజయ్య, బిజెపి సీనియర్ నాయకులు జెనిగలా శ్రీనివాస్, గురవయ్య, నాగ సైదులు, తాళ్ళ నరేష్ ,చంద్రశేఖర్ రెడ్డి ఎడవెల్లి సాగర్ రెడ్డి, సుందరి రమేష్ కాంపాటి రాజు, లింగరాజు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు...

# ఎస్ ఎస్ సి పరీక్షలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహం



**నేరేడుచర్ల (మన ప్రజాప్రతినిధి దినపత్రిక:** లయన్స్ క్లబ్ నేరేడుచర్ల ఆధ్వర్యంలో, మండలంలో ఎస్.ఎస్.సి. పరీక్షల్లో మండల స్థాయి లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ మరియు గురుకుల పాఠశాలల విద్యార్థుకు అభినందన కార్యక్రమం ZPHS నేరేడుచర్ల లో ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు జిలకర రామస్వామి అధ్యక్షత వహించగా, నేరేడుచర్ల మండల విద్యాధికారి పుట్లూరి సత్యనారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ రోజు ప్రభుత్వ పాఠశాలలు దేశ భవిష్యత్‌ను తీర్చిదిద్దే విద్యా మందిరాలుగా నిలుస్తున్నాయి. ప్రభుత్వం అందిస్తున్న ఆధునిక సౌకర్యాలు, విద్యా వనరులు, వాటిని సమర్థంగా వినియోగిస్తున్న ఉపాధ్యాయుల అనుభవజ్ఞానం, అంకితభావం విద్యార్థుల ప్రతిభను వెలిగించుతోంది. పట్టుదలతో పాఠశాలలకు సేవ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఉత్తమ మార్గదర్శకులవుతున్నారు. ఈ విద్యార్థులు భవిష్యత్తులో కూడా ఉన్నత స్థాయిలో ఉండాలని ఆకాంక్షిస్తున్నాముఅని తెలిపారు. ఈ కార్యక్రమంలో, దిర్శించర్ల జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని దామరచర్ల ప్రణవి 564 మార్కులతో ప్రథమ స్థానం, చిల్లేపల్లి బాలికల గురుకుల పాఠశాల విద్యార్థిని కామల్లచందు ప్రియ,నిమిషకవి. కీర్తన 563 మార్కులతో సంయుక్తంగా ద్వితీయ స్థానం లో నిలిచారు. టాపర్స్‌గా నిలిచిన ముగ్గురు విద్యార్థులకు కలిపి రూ. 14,000/- నగదు ప్రోత్సాహకాలు లయన్స్ క్లబ్ తరఫున అందజేయడం జరిగింది. ఈ అభినందన సభలో జోన్ చైర్మన్ చల్లా ప్రభాకర్ రెడ్డి, డిస్ట్రిక్ట్ చైర్పర్సన్ బట్టు మధు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అనుకరణ, చార్టర్ ప్రెసిడెంట్ కొణతం సీతారామరెడ్డి, క్లబ్ కార్యదర్శి గుండ్రెడ్డి సైదిరెడ్డి, కోశాధికారి షేక్ యూసుఫ్, పూర్వ అధ్యక్షులు రాచకొండ అంజయ్య, లయన్స్ క్లబ్ సభ్యులు వీరమల్ల. సత్యనారాయణ ,చింతకుంట్ల. పూర్ణ చంద్రారెడ్డి, ఉప్పల లక్ష్మారెడ్డి, లాయర్ విశ్వనాథం, వల్లూరి శ్రీనివాసరావు,ములగండ్ల.వెంకట్ రెడ్డి ,బసవ కోటేశ్వరరావు, తక్కలపల్లి నాగార్జున, ఉపాధ్యాయులు శౌరి, రషీద్ ఖాన్ ,నాగేష్, అనంతరెడ్డి, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి జిల్లాలో పలుచోట్ల ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఐపీఎస్ చేతుల మీదుగా....... చలివేంద్రాలు ఏర్పాటు.....







**ప్రజా ప్రతినిధి తిరుపతి జిల్లా:**వేసవి కాలంలో దాహంతో ప్రజలు ఎవరు ఇబ్బందులు పడకుండా ఉండాలనే ఉద్దేశంతో తిరుపతి జిల్లా వ్యాప్తంగా చలివేంద్రాలు ఎర్పాటు చేశామని జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఐపీఎస్ తాజా గా ఈ రోజు తిరుపతి బస్టాండ్ సమీపంలోని పూర్ణ కుంభం పోలీస్ అవుట్ ఫోస్టు పక్కన చలివేంద్రాన్ని ఎస్పీ ఏర్పాటు చేశారు.అక్కడ ఉన్న పోలీసు సిబ్బంది తోపాటు స్థానికంగా ఉన్న ఆటో డ్రైవర్లు ప్రారంభోత్సవాని వచ్చారు.తొలి రోజు కావడంతో మజ్జిగ ప్యాకెట్స్, స్వీట్లును ప్రజలతో పాటు ఆటోడ్రైవలర్లు ఎస్పిగారు అందిచారు.ఆటో డ్రైవర్ల సమస్యలను ఎస్పి గారు అడిగి తెలుసుకున్నారు..ప్రతి ఒక్కరూ పోలీసు నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలన్నారు లౌడ్ స్పీకర్స్ పెట్టి ప్రజలను ఇబ్బందులు కల్గించ వద్దన్నారు.ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.వేసవి కాలంలో ప్రజలెవరు దేహానికి ఇబ్బందులు పడకుండా ఉండాలంటే చలివేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.పోలీసు స్టేషన్స్ వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు జంతువులకు, పక్షులకు కూడా మంచినీటిని ఏర్పాటు చేయాలన్నారు.ఇదిలా తిరుపతి ట్రాఫిక్ పోలీసులు వినూత్నమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. చలివేంద్రం వద్ద పోలీసు అవుట్ ఫోస్టులో ప్రజలకు అవగాహన కల్పించే వివిధ రకాలైన ఎనౌన్ మెంట్స్ ఎర్పాటు చేశారు. హెల్మెట్ ధరించకొండి... మీ ప్రాణాలని కాపాడకొండి.నో పార్కింగ్.. నో ఎంట్రీ ఉన్న చోట వాహనాలను నిలపరాదు... నడపరాదు..ట్రాఫిక్ సిగ్నల్స్ ను తప్పని సరిగా పాటించాలి. బస్టాప్, రోడ్డు జంక్షన్ రైట్ కార్నర్ వద్ద జీబు, ట్రాక్సిలను నిలిపరాదు.జీబులో, ట్రాక్సిలలో రేడియో, కాని, స్టీరియో కాని, సౌండ్ సిస్టమ్ పెట్టడం మంచిది కారు.డ్రైవింగ్ చేస్తూ.. మత్తు పదార్థాలు సేవించి వాహనాలు నడపరాదు. డ్రైవింగ్ చేస్తూ..సెల్ ఫోన్ మాట్లాడరాదు...అతి వేగంగా అజాగ్రత్తగా వాహనాలు నడపరాదు హెల్మెట్ ధరచి వాహనాలనునడపాలి...అలా చేయడం ద్వారా ఎదైమ యాక్సిడెంట్ జరగిన మన ప్రాణాలను మనం కాపాడుకుంటాము.అంతే కాకుండా సైబర్ నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.ప్రజల కోసం పోలీసులు మంచినీరు ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కె. రవి మనోహరాచారి అదనపు ఎస్పీ పరిపాలన,రామకృష్ణ చారి ట్రాఫిక్ డిఎస్పి, శ్భక్తవతలం డి ఎస్పీ తిరుపతి టౌన్, సంజీవ్ కుమార్ ట్రాఫిక్ సిఐ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# సమస్యలకు పరిష్కారం చూపే భూభారతి

భూభారతి చట్టం ద్వారా భూ సమస్యలకు శాశ్వతమైన పరిష్కారాన్ని అందించేందుకు ప్రభుత్వం నూతన చట్టాన్ని తీసుకురావడం జరిగింది. ఈ చట్టం ద్వారా భూ రికార్డుల సమస్యలు, హక్కుల సమస్యలు సులభంగా పరిష్కారం పొందే దిశలో ముందుకు వెళ్లింది.సమస్యలకు పరిష్కారం చూపే భూభారతి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి తెలుగు రాష్ట్రాల్లో కేవలం రెండు ఆర్వోఆర్ చట్టాలు మాత్రమే వచ్చాయి. 1948, 1971లలో నాటి పాలకులు తెచ్చిన ఈ చట్టాలు చరిత్రలో నిలిచిపోయాయి. రాష్ట్రంలో ప్రస్తుతం భూ రికార్డులకు ప్రామాణికమైన ఖాస్రా పహాణి, షేత్వార్, సెసాల వంటివి 1948 చట్టం ద్వారానే రూపొందించారు. 1971చట్టం ద్వారా తెచ్చిన భూ రికార్డును తెలిపే 1%-%బి రిజిస్టర్ ఎంతో ఉపయోగకరం. 1948ఆర్వోఆర్ చట్టంలో స్వల్ప మార్పులను చేసి 1971 చట్టాన్ని రూపొందించారు. కొంత ఆలస్యమైనా చట్టాలకు అనుగుణంగా వాటికి రూల్స్‌ను కూడా రూపొందించి అందుబాటులోకి తెచ్చారు. నాటి పాలకులు, అధికారులు ప్రజల కోణంలో నుంచి ఆలోచించి తెచ్చిన చట్టాలు కావడంతో అవి పది కాలాల పాటు ఉన్నాయి. ఈ చట్టాల అమలుతో రెవెన్యూ వ్యవస్థ బలోపేతమైంది. కానీ ధరణి%-%2020 చట్టం ఇందుకు పూర్తిగా భిన్నమైనది.ధరణిలో ఎలాంటి రూల్స్‌ను రూపొందించలేదు. ఇదే కాకుండా ఎలాంటి కొత్త రికార్డును తయారు చేయలేదు. 1971 చట్టం ప్రకారం హక్కుల రికార్డుగా ఉన్న 1%-%బి రికార్డే ఇందులోనూ హక్కుల రికార్డుగా కొనసాగింది. ధరణి పుణ్యమా అని గ్రామ, మండల స్థాయిలో అందాల్సిన సేవలు జిల్లా, రాష్ట్ర రాజధానులకు చేరాయి. రైతుకు ఏ చిన్న సమస్య వచ్చినా సీసీఎల్ఏకు పరుగులు తీయాల్సిన దుస్థితి ఏర్పడింది. ధరణిలో తప్పుల సవరణకు రెవెన్యూ అధికారులకు ఎలాంటి అధికారాలూ లేవు. అంతేకాదు, ఏ చిన్న భూ సమస్య వచ్చినా కోర్టు మెట్లెక్కాల్సిందే.రాష్ట్రంలో భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే లక్ష్యంతో రేవంత్‌రెడ్డి సర్కార్ నూతన చట్టం 'భూమి హక్కుల రికార్డు- 2025' భూభారతి తీసుకొచ్చింది. నాటి పాలకులు ధరణి అని పేరు పెడితే, నేటి పాలకులు భూభారతి అని పేరు పెట్టకున్నారు అనుకోవచ్చు. కానీ ఈ చట్టం కోసం దేశంలోని 18 రాష్ట్రాల్లో అమలవుతోన్న ఆర్వోఆర్ చట్టాలను అధికారులు అధ్యయనం చేశారు. రాష్ట్రంలో పరిస్థితులకు అనుగుణంగా రెవెన్యూ చట్టాల్లో తేవాల్సిన మార్పులతో పాటు భూ సంస్కరణలపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.సామాన్య రైతులకు అర్థమయ్యేలా, మరోవైపు ఆధునిక టెక్నాలజీతో భూభారతి రూపకల్పన చేశారు. అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న భూ చట్టాలకు, ఆధునిక టెక్నాలజీకి అనుసంధానంగా ఉండేలా భూభారతిని తీర్చిదిద్దారు. గత ప్రభుత్వం సాదా బైనామాలను క్రమబద్ధీకరిస్తామనడంతో సుమారు 10 లక్షల దరఖాస్తులొచ్చాయి. కానీ ధరణిలో సాదా బైనామాల క్రమబద్ధీకరణకు అవకాశం లేదు. ఇదే కాకుండా 2017లో చేసిన భూ రికార్డుల ప్రక్షాళన సమయంలో వివిధ రకాల భూ సమస్యలున్న సుమారు 18 లక్షల ఎకరాల భూమిని 'పార్టు--%బి'లో చేర్చి వదిలేశారు. అవి కూడా ధరణికి దూరమయ్యాయి. ఇవే కాకుండా అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణ, ఇనాం భూముల కు ఓఆర్సీ పొందిన, వారసత్వంగా వచ్చిన భూములను సైతం ధరణిలో చేర్చే అవకాశం లేదు. భూభారతిలో ఇలాంటి అన్ని రకాల సమస్యలకు పరిష్కారం లభించనుంది. వీటికి కావాల్సిన విధి విధానాలను కూడా భూభారతిలో రూపొందించారు. జూన్ 2, 2014 కంటే ముందు సాదా బైనామా పద్ధతిలో భూమిని కొనుగోలు చేసి, క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్న వారికి ఆర్డీఓ స్థాయిలో విచారణ చేసి ఈ భూభారతి ద్వారా పట్టాదారు పాస్ పుస్తకం ఇవ్వనున్నారు. వారసత్వంగా వచ్చిన భూములకు తహసీల్దార్ స్థాయిలోనే విచారణ చేసి హక్కుల రికార్డులో మ్యుటేషన్ చేయనున్నారు. ఇదే తరహాలో హక్కుల రికార్డులో తప్పుల సవరణకు కూడా ఆర్డీఓ, జిల్లా కలెక్టర్లకు అధికారం ఇచ్చారు.భూభారతిలో రెండంచెల అప్పీల్ వ్యవస్థ అందుబాటు లోకి రానుంది. తహసీల్దార్ చేసిన మ్యుటేషన్లు, జారీ చేసిన పాసు పుస్తకాలు, భూదార్‌పై అభ్యంతరాలు ఉంటే ఆర్డీవోకు అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుంది. ఆర్డీవో ఇచ్చిన తీర్పుపై జిల్లా కలెక్టర్‌కి రెండో అప్పీల్ చేసుకునే వెసులుబాటు కూడా కల్పించారు.ఆర్డీవో చేసిన మ్యుటేషన్లు,సాదాబైనామాల క్రమబద్ధీకరణపై అభ్యంతరాలు ఉంటే జిల్లా కలెక్టర్‌కు, జిల్లా కలెక్టర్ తీర్పుపై భూమి ట్రిబ్యునల్‌కు రెండో అప్పీల్‌కు కూడా పోయేలా భూభారతిలో అవకాశాన్ని కల్పించారు.ధరణిలో దగాపడిన వారికి భూభారతిలో అనేక వెసులుబాట్లు కల్పించారు. హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు, భూమి హక్కులు ఉండి రికార్డుల్లో లేని వారు హక్కుల రికార్డులో నమోదు చేయించుకోవడానికి ఏడాది పాటు అవకాశం ఇచ్చారు.ప్రభుత్వ భూములకు పాసు పుస్తకాలు జారీ చేస్తే, దాన్ని విచారించి పాసు పుస్తకం రద్దు చేసే అధికారం సీసీఎల్ఏకు ఇచ్చారు.ఆ భూమిని స్వాధీనం చేసుకోవడంతో పాటు తహసీల్దార్,సంబంధిత అధికారులపై శాఖా పరమైన చర్యలతో పాటు క్రిమినల్ కేసులను కూడా బనాయించే అవకాశం ఉంటుంది. ఇదే కాకుండా రికార్డులను ట్యాంపర్ చేసినా,నిబంధనలకు విరుద్ధంగా ఉత్తర్వులు జారీ చేసినా అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకోనున్నారు. అవసరమైతే వారిని సర్వీసు నుంచి తొలగించే ప్రమాదం కూడా ఉంది.గతంలో ఎన్నడూ లేని విధంగా భూ సమస్యలకు సంబంధించి పేదలు ఎస్సీ, ఎస్టీ, మహిళా రైతులకు న్యాయ సేవా సంస్థలు, ఇతర సంస్థల ద్వారా ఉచిత న్యాయ సాయం కూడా అందించనున్నారు.

## రాష్ట్ర అధికార పార్టీ ప్రతినిధి రెడ్డివారి గురువారెడ్డి చేతులు మీదుగా మండలంలో పలుచోట్ల చలివేంద్రాలు ఏర్పాటు



**ప్రజా ప్రతినిధి ఏర్పేడు మండలం:** ఏర్పేడు మండలం కేంద్రమైన మండల ప్రజలందరూ చుట్టుపక్కల గ్రామాల నుంచి ఏదో వారి వారి సొంత పనుల మీద ఏర్పేడు మండలానికి చేరుకోవడం జరుగుతుంది. ఈ తరుణంలో ఇప్పుడు వేసవికాలం అధికంగా ఉండడం వలన పేద ప్రజలను దృష్టిలో ఉంచుకొని తెలుగుదేశం నాయకులందరూ కలిసి మండలంలోని పలుచోట్ల రెడ్డివారి గురువారెడ్డి చేతులమీదుగా మండలంలో పలుచోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగింది... ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రెడ్డి వారి గురువారెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరికి కూడా మంచినీళ్లు అందుబాటులో ఉంచాలని సదుద్దేశంతో ఈ యొక్క కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన వివరించారు.. పేద ప్రజలు శీతల పానీయాల దుకాణాలలో నీళ్లు డబ్బులు వెచ్చించి కొనుక్కోలేని పరిస్థితిలో ఉంటారని అలాంటి పేదవారందరి కోసం గొప్ప మనసుతో తెలుగుదేశం నాయకులు అందరూ ఆలోచించి ఈ యొక్క చలివేంద్రాల ను ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో భారీ ఎత్తున తెలుగుదేశం నాయకులు అలాగే ప్రజలందరూ పాల్గొన్నారు

# దాతల సహకారంతో ఆర్థిక సాయం



**నేరేడుచర్ల (మన ప్రజాప్రతినిధి దినపత్రిక ):** నేరేడుచర్ల మండల పరిధిలోని పెంచికల్ దిన్నె గ్రామానికి చెందిన యడవల్లి మహేష్ బాబు తల్లిదండ్రులు యడవల్లి సైదులు ప్రమీల గత కొంతకాలం క్రితం చనిపోయారు. అనాథ అయిన మహేష్ బాబుకి గ్రామంలోని యువత జీడిమెట్ల రవి , భార్గవ్ సైదులు ఇద్దరూ వాట్సాప్ ద్వారా మహేష్ బాబు స్థితిగతులను తెలియపరచి వారి ఫోన్ పే గూగుల్ పే ద్వారా 34 వేల రూపాయలను దాతల సహకారం ద్వారా సమకూర్చారు. అట్టి మొత్తం డబ్బును గ్రామ పెద్దల సమక్షంలో శుక్రవారం అతనికి అందజేయడం జరిగింది. మహేష్ బాబు టీజీ ఎస్ డబ్ల్యూ ఆర్ ఎస్ గురుకుల హాస్టల్ మిర్యాలగూడలో ఇంటర్ మీడియట్ ఎం.పీ.సీ ఫస్ట్ ఇయర్ లో 447/470 మార్కులతో పాసయ్యాడు.అతనికి ప్రస్తుత విద్యా పరమైన అవసరాల మేరకు ఈ డబ్బుని అందించడం జరిగింది.ఈ సందర్భంగా భార్గవ్ సైదులు జీడిమెట్ల రవి లు మాట్లాడుతూ... మహేష్ బాబుకు ఆర్థికంగా సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.ఇట్టి కార్యక్రమంలో నందమూరి బాబురావు , వల్లంచట్ల మట్టపల్లి రావు , ఇంజమూరి వెంకటయ్య , సిద్ధపంగ సైదులు , పెండెం హరిబాబు , అల్వాల శ్రీధర్ , సిద్ధపంగా సైదులు,లక్ష్మీ నర్స్, కోడి పవన్ , వెంకట నర్సు , ఏసు , రాహుల్ , పొలం చెట్ల భుజంగరావు , నందమూరి నరసింహారావు , తదితరులు పాల్గొన్నారు.

# మండల విద్యాధికారికి ఘన సన్మానం



**మన ప్రజా ప్రతినిధి// దౌల్తాబాద్,:** ఈరోజు మండల వనరుల కేంద్రం దౌల్తాబాద్ నందు మండల విద్యాధికారి గజ్జెల కనకరాజు గారికి మండల వనరుల కేంద్రం సిబ్బంది ఘన సన్మానం చేయడం జరిగింది . దౌల్తాబాద్ మండలాన్ని పదవ తరగతి ఫలితాలలో నాలుగవ స్థానం సాధించినందుకు అదేవిధంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తిర్మలాపూర్ లో పదవ తరగతి ఫలితాలు శతశాతం సాధించినందుకు గాను సన్మానం చేయడం జరిగింది మండలంలోని అన్ని పాఠశాలల ఫలితాలను బట్టి మండల విద్యాధికారి హర్షనీయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎం ఐ ఎస్ కోఆర్డినేటర్ ఏ.శేఖర్ సి సి ఓ పెంటయ్య సిఆర్పిలు రాజు కుమార్ నగేష్ చంద్రమౌళి మల్లేశం పాల్గొన్నారు.

# తండ్రి కి తల కొరివి పట్టిన కూతురు



**మన ప్రజా ప్రతి నిధి//దౌల్తాబాద్:** సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం సూరంపల్లి గ్రామంలోదకన్న కూతురు కన్న తండ్రికి తల కొరివి పట్టిన పరిస్థితి ఈరోజు సూరంపల్లి గ్రామంలో చోటు చేసుకుంది దోమల శ్రీనివాసు సూరంపల్లి వాస్తవ్యులు దౌల్తాబాద్ మండలానికి చెందిన ఆటో కార్మికుడు గత 20 సంవత్సరాల నుండి ఆటో నడుపుకుంటూ తన కుటుంబాన్ని పోషించు కుంటున్నాడు అతనికి ఇద్దరు కుమార్తెలు అంతలోనే ఫ్రీ బస్సులు రావడం వల్ల తనకు ఏం చేయాలో తెలియక వ్యవసాయం చేయడానికి భూమి కూడా లేదు బతికితే ఆటో పైనే ఇంట్లో సంసారం గడవక అప్పులు చేయడం వల్ల అప్పులు తీర్చలేని ఆటో నడవలేని పరిస్థితిలో మనస్థాపానికి గురై కనీసం తనకు ఆరోగ్యం చెడిపోతే చూపించుకోలేని దౌర్భాగ్యంలో ఉండి నిన్న రాత్రి 11:30 నిమిషాలకు హార్ట్ స్ట్రోక్ వచ్చి మరణించడం జరిగింది. దీన్ని మేము భగత్ సింగ్ ఆటో యూనియన్ తరపు వారు 10 వేలు రూపాయలు ఆర్థిక సాయం చేయడం జరిగింది కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా మన తెలంగాణ ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి గారికి ఆటో కార్మికులు కోరుకునేది ఒక్కటే న్యాయం చేయాలని కోరుకుంటున్నాను ఇలాంటి పరిస్థితి మారే ఒకరికి రావద్దని కోరుకుంటున్నాను ఇందులో పాల్గొన్నవారు ఆటో యూనియన్ అధ్యక్షులు యాదగిరి. ఉపాధ్యక్షులు నాగులు. నాయకులు షపి. దోమల సాయిలు నీరుడు రవి తదితరులు పాల్గొన్నారు

# కార్మికుల శ్రమ ఎనలేనిది

**స్థానిక మున్సిపల్ కార్మిక సిబ్బందిని సన్మానించిన శ్రీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ పెద్దలు**



**మనప్రజాప్రతినిధి//సిద్దిపేట:**సిద్దిపేట జిల్లా కార్మికుల సేవలు ఎనలేనివని మున్సిపల్ ఐదవ వార్డు బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అన్నగోని వినోద్ గౌడ్ అన్నారు. మున్సిపల్ కార్మికులను శ్రీనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ పెద్దలు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ మేడే సందర్భంగా స్థానిక వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు నాతోపాటు నిరంతరం శ్రమించే కార్మిక శ్రమజీవులను సన్మానించడం ఎంతో ఆనందంగా ఉందని.. శ్రమ జీవుల కష్టానికి ప్రతిఫలంగా మేడే పండుగను జరుపుకోవడం ఎంతో గర్వంగా ఉందన్నారు.